మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల్ / నారాయణపేట

# ధాన్యం వెంటనే మిల్లులకు తరలించాలి

- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి
- జడ్చర్లలో ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ
- గంగాపూర్ పిహెచ్‌సి సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 21 ప్రభాతవార్త:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బుధవారం జడ్చర్ల మండలంలో జిల్లా కలెక్టర్ పర్యటించి మండలంలోని గంగాపూర్, కొడుగల్ గ్రామాలలో ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం (పిఏసిఎస్) ద్వారా ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడి ఏమైనా సమస్యలు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తేమ శాతం పరీక్షించారు. జడ్చర్ల మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, బాదేపల్లి ద్వారా గంగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రైతుల నుండి కొనుగోలు చేసిన ధాన్యంను త్వరగా కొనుగోలు కేంద్రంకు టాగ్ చేసిన రైస్ మిల్లకు రవాణా చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను, అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని తేమ, నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి ధాన్యానికి క్రమ పద్ధతి లో టోకెన్‌లు అంద చేసి కొనుగోలు చేసిన వెంటనే రైతులకు ఇబ్బంది లేకుండా మిల్లులకు రవాణా చేయాలని సూచించారు కొనుగోలు కేంద్రాల నుండి ప్రతి రోజూ ఎన్ని లారీలు రవాణా చేయుటకు ఏర్పాటు చేశారు అని అడిగారు. 6 లారీల ద్వారా ధాన్యం రవాణా చేస్తున్నట్లు కలెక్టర్ కు వివరించారు ఇంకా కొనుగోలు కేంద్రంలో ధాన్యం బస్తాలు ఉన్నాయి వెంటనే కావలసిన లారీలు ఏర్పాటుచేసి రవాణా చేయాలని సూచించారు .కొడుగల్ గ్రామంలో పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతు విక్రయించిన ధాన్యంను కొనుగోలు పత్రం జారీ చేసిన తర్వాత రైతులను వేచి ఉంచకుండా కేంద్రం నిర్వాహకులు బాధ్యత తీసుకుని ధాన్యం బస్తాలు తరలించాలని స్పష్టం చేశారు. రైతుల సౌకర్యార్థం ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. ప్యాడి క్లీనర్‌లను ఉపయోగించి ధాన్యం శుభ్రపరచాలని రైతులకు, నిర్వాహకులకు సూచించారు. జిల్లా కలెక్టర్ వెంట పౌర సరఫరాల సంస్థ డిఎం రవినాయక్ తదితరులు ఉన్నారు. పిహెచ్‌సిని తనిఖీ చేసిన కలెక్టర్ జడ్చర్ల మండలంలో గంగాపురం గ్రామం పిహెచ్‌సిని బుధవారం కలెక్టర్ విజయేందిర బోయి ఆకస్మికంగా తనిఖీ చేశారు, పిహెచ్‌సి ఆవరణలో చెత్తాచెదారం పడి ఉండి పరిశుభ్రత లేకపోవడం గమనించి కలెక్టర్ సంబధిత వైద్య సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిహెచ్‌సి ఆవరణ, గదులు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నెల పిహెచ్‌సిలో నిర్వహించే ప్రసవాల గురించి తెలుసుకున్నారు. ఓపి రిజిస్టర్‌ను పరిశీలించారు. బుధవారం 80 మంది ఓపి నమోదు చేసుకున్నట్లు వైద్య అధికారి వివరించారు. ఆసుపత్రిలో మందులు అందుబాటులో ఉన్నాయా అని అడిగారు. మందుల కొరత లేదని మెడికల్ ఆఫీసర్ తెలిపారు.



గంగాపూర్ పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న కలెక్టర్

## ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది



రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

- రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- భూ భారతి అర్జీలపై పక్కాగా క్షేత్రస్థాయి విచారణ
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే21 ప్రభాతవార్త:** కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని, కొనుగోలు కేంద్రాలలో సరిపడా ధాన్యం కొనుగోలు, లారీలు, గోనె సంచుల సమాచారం పట్ల రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండలం కొండూరు గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిర్వహిస్తున్న రిజిష్టర్‌లను పరిశీలించారు. ఇంతవరకు కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, రైస్ మిల్లులకు తరలించిన వివరాలు మద్దతు ధర చెల్లించిన వివరాలు మొదలగు అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ అధికారులు ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో తరలించి రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వాతావరణ మార్పు దృష్ట్యా అకాల వర్షాలు సంభవించే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాలలో ధాన్యం తడవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వ సూచించిన ప్రకారం రైతుల నుండి ధాన్యం సేకరించడం జరుగుతుందని, రైతులు ఎలాంటి ఆందోళన పడాల్సిన అవసరం లేదని అన్నారు. ధాన్యం కొనుగోళ్లు, రవాణా చేయు సందర్భంలో కేంద్రాల నిర్వహకులు సంబంధిత అధికారులు ప్రతి ఒక్కరూ అప్రమత్తతతో ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గత ఏడాదితో పోలిస్తే జిల్లాలో ఈ సంవత్సరం అధిక దిగుబడి -మిగతా4లో..

## రాజీవ్ యువ వికాసం పథకంపై కలెక్టర్ సమీక్ష

- జిల్లాలో 41,000 దరఖాస్తులు
- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 21 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం, బీసీ,ఎస్సి, మైనారిటీ, ట్రైబల్, ఎస్సి కార్పొరేషన్, అధికారులతో రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియపై బుధవారం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఆర్థిక సహాయం, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధి అవకాశాల కల్పనలను రూపొందిస్తుందని, రాజీవ్ యువ వికాసం పథకం కొరకు జిల్లా వ్యాప్తంగా 41వేల దరఖాస్తులు అందాయని, దరఖాస్తు దారులతో సంబంధిత అధికారులు ఇంటర్వ్యూ ప్రక్రియను పూర్తి చేశారని, బ్యాంక్ అధికారులు అప్లికేషన్‌లను -మిగతా4లో..

## రాజీవ్ గాంధీకి ఘన నివాళి

- ఆధునిక భారత నిర్మాత..సూపర్ కంప్యూటర్‌ను పరిచయం చేసిన మేధావి
- రాజీవ్ గాంధీ వర్ధంతిలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి, నాయకులు

**మహబూబ్‌నగర్ బ్యూరో,మే 21 ప్రభాతవార్త:** ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజీవ్ గాంధీ 38 వ వర్ధంతి సందర్భంగా అశోక్ టాకీస్ చౌరస్తాలో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించి, యువతను భారతదేశ నిర్మాణంలో భాగస్వామ్యం చేశారని ఆయన గుర్తు చేశారు. నేడు ప్రపంచంలో భారతదేశం నాల్గవ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చెందుతుంటే అందుకు కారణం నాడు రాజీవ్ గాంధీ వేసిన పునాదులే కారణమని, భవిష్యత్తు అంతా కంప్యూటర్‌దే అని గమనించి, నాడు విశ్వవిద్యాలయాలలో, కళాశాలలో కంప్యూటర్‌ను అందజేసి,సూపర్ కంప్యూటర్‌ను దేశానికి తెచ్చిన ఘనత రాజీవ్ గాంధీకే చెల్లిందన్నారు. ఆయన ఎదుగుదల చూడలేక విదేశీ శక్తులు కొన్ని ఆయనను మానవ బాంబు రూపంలో పొట్టన పెట్టుకున్నారని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఆ మహనీయునికి ఈ సందర్భంగా ఘనంగా నివాళులు అర్పిస్తూ వారు చూపిన అడుగు జాడల్లో ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టి పిసిసి ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సంజీవ్ ముదిరాజ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ,ఎస్సి సెల్ చైర్మన్ సాయి బాబా, ఐఎన్టీయుసి రాములు యాదవ్, నాయకులు సిజె బెనహార్, ఫ్రాంక్, అవేజ్, ఆజ్మత్ ఆలి, సల్మాన్, ఏర్పుల నాగరాజు, రామచంద్రయ్య, నీటూరి బాలయ్య, జహీర్, చర్ల శ్రీనివాస్, అక్బర్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలి

- నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్




వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

**ఉట్కూరు, మే 21 ప్రభాతవార్త:** ఉట్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి ఉట్కూర్ పోలీస్ స్టేషన్ ను సందర్శించిన జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి బాధితులకు తక్షణమే న్యాయం చేసే విధంగా విధి నిర్వహణ ఉండాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అధికారులకు, సిబ్బందికి సూచించారు. పోలీసు స్టేషన్ ఆవరణలో 5ఎస్ అమలు తీరును, విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, స్టేషన్ రికార్డ్స్, పెండింగ్ ఫైల్స్, రికార్డ్ రూమ్, రైటర్ రూమ్ తదితర అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్‌పై ప్రత్యేక దృష్టి చూపుతూ గ్రామాలను తరుచుగా సందర్శించాలన్నారు. పాత నేరస్థులపై రౌడి షీటర్స్‌పై నిఘా ఉంచాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ప్రజలతో సత్సంబంధాలను మెరుగుపరచుకుంటూ ప్రజలకుయువతకు ప్రత్యేకంగా సైబర్ నేరగాళ్లపై వారు ప్రస్తుతం వినియోగిస్తున్న నూతన పద్ధతులపై వివరించి వారిలో చైతన్యాన్ని తీసుకురావాలని సూచించారు. స్టేషన్ పరిధిలో తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌గా గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు. ప్రతిరోజు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. ఎస్పీతో పాటు మక్తల్ సీఐ రామ్‌లాల్, ఉట్కూర్ ఎస్సై కృష్ణంరాజు, సిబ్బంది ఉన్నారు.

## రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

- వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ సురభి

**వనపర్తి ప్రతినిధి, మే 21 ప్రభాతవార్త:** జిల్లాలో రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్‌లో వనపర్తి పట్టణం నుండి వెళ్ళే పానగల్, కొత్తకోట, పెబ్బేరు రోడ్డు విస్తరణపై అటవీ శాఖ, రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న షాపింగ్ యజమానులు, ఇళ్ల యజమానులకు నోటీస్‌లు జారీ చేసే ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. నోటీసులు జారీ చేసిన వారికి ఖాళీ చేసేందుకు కొంత సమయం ఇచ్చి భవనాల కూల్చివేతలు ప్రారంభించాలని పేర్కొన్నారు. రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని రెవెన్యూ, రోడ్లు భవనాల శాఖ అధికారులకు తెలిపారు. అదేవిధంగా అటవీ శాఖకు సంబంధించిన పెబ్బేరు రోడ్డు, ఈకో పార్కు, ఔటర్ రింగ్ రోడ్డు, స్పోర్ట్స్ స్కూల్ కు సంబంధించిన అటవీ భూముల విషయంలో అటవీ శాఖ అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ సమావేశంలో డిఎఫ్ఒ ప్రసాద్ రెడ్డి, ఆర్‌ఎఫ్ఒ అరవింద్ రెడ్డి, ఆర్డీఓ సుబ్రమణ్యం, స్థానిక తహసీల్దార్ రమేష్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,రోడ్లు భవనాల శాఖ, మున్సిపల్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పార్టీ కోసం పనిచేసిన వారికే పదవులు

- కాంగ్రెస్ పార్టీది ఒకే కుటుంబం
- పాత కొత్త భేదం లేదు
- నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మే 21 ప్రభాతవార్త:** నిరుపేదల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీఎంతో చేస్తుందని ఇలాంటి ప్రజా సంక్షేమం కోరే పార్టీలో పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికి పదవులు దక్కుతాయని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వనపర్తి పట్టణంలోని కళ్యాణ సాయి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన వనపర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 140 సంవత్సరాల చరిత్ర గల కాంగ్రెస్ పార్టీది ఒకే కుటుంబమని వట వృక్షం లాంటి కాంగ్రెస్ పార్టీ నీడన ఉండే ప్రతి కాంగ్రెస్ వాది పార్టీ బలోపేతం కోసం సైనికునిల పనిచేయాలని పిలుపునిచ్చారు. వనపర్తి నియోజకవర్గంలో కొంతమంది ప్రతిపక్ష నాయకులు శిఖండి రాజకీయాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీలో కుటుంబ తగాదాలు ఉన్నాయంటూ నీతిమాలిన రాజకీయాలు చేస్తున్నారని వారందరికీ ఈ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత సమావేశమే చెంపపెట్టు కావాలని ఆయన పేర్కొన్నారు.




సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

టిపిసిసి ఆదేశాల మేరకు పరిశీలకులు సంజయ్ ముదిరాజ్,గౌరి సతీష్‌ల సమక్షంలో నిర్వహిస్తున్న ఈ విస్తృతచారి సమావేశం కాంగ్రెస్ పార్టీ ఐక్యతను చాటి చెప్తుందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పదవులు ఆశించే ప్రతి ఒక్కరు ఒక్కొక్కరుగా దరఖాస్తు చేసుకుంటే పార్టీకి సులభతరం అవుతుందని గ్రామ అధ్యక్షుడు, మండలాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షులకు సంబంధించి పదవులు ఆశించే వారందరూ గ్రామస్థాయిలోనే పూర్తిస్థాయి సమన్వయంతో పేర్లను ఎంపిక చేయాలని ఎమ్మెల్యే సూచించారు. గత పదేళ్ల కాలంలో బిఆర్ఎస్ పార్టీ చేసిందేమీ లేదని, ప్యాకేజీ నెంబర్ 27,బీమా ఫేస్ 1 ఫేస్ 2, గుడిపల్లి రిజర్వాయర్, కల్వకుర్తి ఎత్తిపోతల లాంటి అనేక ప్రాజెక్టుల నిర్మాణంలో డా.చిన్నారెడ్డి పాత్ర ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులకు అక్కడక్కడ చిన్నచిన్న బొక్కలు పెట్టి తామే వనపర్తి నియోజకవర్గానికి సాగునీరందించామని గొప్పలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ పార్టీలో -మిగతా4లో..

## 100 వాహనాలతో భారీ కాన్వాయ్

- సరస్వతి పుష్కరాలకు చేరుకుని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రత్యేక పూజలు



నదీస్నానం ఆచరిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

## ప్రజలు క్యాన్సర్ స్క్రీనింగ్ పై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్యశాఖ అధికారి

**వనపర్తి క్రైమ్, మే 21 ప్రభాతవార్త :** క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రాముఖ్యతపై ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాసులు అన్నారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. క్యాన్సర్ స్క్రీనింగ్ అవగాహన కార్యక్రమం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరోగ్య వైద్య శాఖ ఆధ్వర్యంలో విజయవంతంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసి స్టేట్ డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ మహిళల్లో సాధారణంగా కనిపించే సర్వైకల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, పురుషుల్లో ప్రోస్టేట్, ఒంటరి క్యాన్సర్ తదితర అంశాలపై నిపుణులు సమగ్రంగా వివరించారు. స్క్రీనింగ్ పరీక్షల్లా ప్రాముఖ్యత ప్రారంభ దశలో గుర్తింపు వల్ల చికిత్సలో సాఫల్యం పొందే అవకాశాలు, గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన పెంపువంటి అంశాలపై చర్చించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రభుత్వ స్క్రీనింగ్ సదుపాయాలపై కూడా వైద్య సిబ్బందికి దిశా నిర్దేశం ఇచ్చారు. పలు ఆరోగ్య కేంద్రాల్లో ఇప్పటికే స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏన్సిడి ప్రోగ్రాం అధికారి డా. రామచంద్రరావు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లు,ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ వైద్యాధికారులు, జిల్లా ఎన్సీడీ సెల్ఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచే ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డిఐఈఓ

**వనపర్తి క్రైమ్, మే 21 ప్రభాతవార్త:** ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు ఈ నెల 22 నుండి 29 వరకు జరుగనున్నాయని డిఐఈఓ ఎర్ర అంజయ్య పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రం లోని పరీక్ష సెంటర్లను పరిశీలించిన ఆయన జిల్లాలో 13 పరీక్షా కేంద్రాల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 3631 ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 2092 మొత్తం 5723 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. జిల్లా మొత్తం మీద ఒక డీఈసీ, ఒక ఫ్లయింగ్ స్క్వాడ్, ఒక సిట్టింగ్ స్క్వాడ్ టీమ్ పర్యవేక్షించనున్నారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం 9 గం.లనుండి మధ్యాహ్నం 12 గం.ల వరకు,ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుండి 5.30 వరకు జరుగుతాయి. విద్యార్థులకు పరీక్ష హాలులోకి గడియారాలు అను మతి లేదు, ప్రతీ పరీక్ష కేంద్రంలో గోడ గడియారాలు అమర్చడం జరిగింది. వనపర్తిలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో -మిగతా4లో..

# వరి దాన్యం సేకరణలో జాప్యం చేయవద్దు

**జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు**



లత్తిపురం వరి కొనుగోలు సెంటరును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ నర్సింగ్ రావు

**గద్వాల, మే 21,ప్రభాతవార్త:** వరి ధాన్యం సేకరణలో జాప్యానికి తావు లేకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు అధికారులకు ఆదేశించారు.బుధవారం గద్వాల మండలం లత్తిపురం గ్రామములో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అయన పరిశీలించారు.కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో భాగంగా నాణ్యత పరీక్ష, సదుపాయాలు, తూగిన తరువాత రసీదు అందజేత వంటి అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వర్షంలో ధాన్యం తడవకుండా అవసరమైన తాడిపత్రి, గొనె సంచులు తదితర సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, పూర్తిగా పారదర్శకంగా,నిర్దిష్టమైన మార్గదర్శకాలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు వేగవంతంగా చేపట్టి పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి రైతుకు ధాన్యం తూగిన వెంటనే బిల్ జారీ చేసి సకాలంలో డబ్బులు అందే విధంగా చూడాలని తెలిపారు.అనంతరం ముల్కలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ నిర్వహణ, సిబ్బంది హాజరు నమోదు,గ్రామస్థులకు అందజేస్తున్న సేవల విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పౌర సేవల సరళీకరణ,కార్యాలయ ప్రామాణికత పెంపు, ప్రజల నమ్మకాన్ని పొందే విధంగా విధుల నిర్వహణపై కార్యాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు అందించే సేవలలో మెరుగుదల కోసం సాంకేతిక పరిజ్ఞానాన్నివినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, సంబంధిత అధికారులు,పాల్గొన్నారు.

# ఆత్మకూరులో ఎరువుల దుకాణాల తనిఖీ



ఆత్మకూరులో ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న వ్యవసాయ అదనపు సంచాలకులు దామోదర్

**ఆత్మకూర్,మే 21 ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఎరువులు మరియు విత్తనాల దుకాణాలను కొత్తకోట అదనపు వ్యవసాయ సంచాలకులు దామోదర్ బుధవారం రోజు తనిఖీ నిర్వహించారు. పట్టణంలోని మహేశ్వరి ట్రేడర్స్,జయలక్ష్మి ట్రేడర్స్ తదితర దుకాణాలను పరిశీలించి ఎరువులు విత్తనాలకు సంబంధించిన స్టాక్ పాయింట్ రిజిస్టర్లను విస్తృతంగా తనిఖీ నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు ప్రస్తుతం రానున్న ఖరీఫ్ సీజన్లో రైతులకు ఎరువులు విత్తనాలు అందుబాటులోఉండాలని అంతేకాకుండా నాణ్యమైనవిత్తనాలను విక్రయించాలని విక్రయించే సమయంలో ప్రతి రైతుకురసీదు విధిగా ఇవ్వాలనితద్వారా రైతులకు విత్తనాలపై భరోసా కలుగుతుందని ఆయన సూచించారు రైతులను మోసం చేసేందుకు ప్రయత్నిస్తే ఎంతటి వారినైనా ప్రభుత్వం కఠినంగా శిక్షించేందుకు సిద్ధంగా ఉందని ఈ విషయాన్ని గుర్తించి ఎరువులు మరియు విత్తనాలు డీలర్లురైతులకుఅన్నివిధాలా తోడ్పాటుఅందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

# నేడు సంగాలలో హనుమాన్ జయంతి వేడుకలను విజయవంతం చేయండి

**గద్వాల, మే 21,ప్రభాత వార్త:** గద్వాల మండల పరిధిలోనిసంగాల గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ నెల 22 గురువారం శ్రీహనుమాన్ జయంతి నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర నాయకులు, సామాజికసేవ నాయకులు అయ్యపు రెడ్డితో పాటు గ్రామస్థులు తెలిపారు. 22 గురువారం ఆలయంలో ఉదయం గోపూజ, నిర్మల విసర్జన, పంచామృతాభిషేకం, పవమాన హోమం, పూర్ణాహుతి, లక్ష పుష్పార్చన, తీర్థప్రసాదం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అయన తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.మండలం, పట్టణ భక్తులు అధిక సంఖ్యలో వచ్చి ఈ కార్యక్రమంను విజయవంతం చేయాలనీ అయ్యపు రెడ్డి కోరారు.

# ప్రభుత్వ నిర్ణయం పట్ల హర్షం



మాట్లాడుతున్న వికాలాంగుల రాజ్యాధికార సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిజ్వార్ నగేష్‌గౌడ్

**ఉట్కూర్, మే 21 ప్రభాతవార్త :** ఉట్కూర్ మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్రంలోని ఇద్దరు దివ్యాంగులై ఉండి పెళ్లి చేసుకుంటే ప్రభుత్వం ఇచ్చే వివాహ ప్రోత్సాహకాన్ని ఇద్దరికీ వర్తించే విధంగా జీవో జారీ చేయడం హర్షించదగ్గ విషయమని వికాలాంగుల రాజ్యాధికార సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బిజ్వార్ నగేష్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ అజీజ్ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో దివ్యాంగులు ఎవరైనా పెళ్లి చేసుకుంటే రూ.3 వేలు వచ్చేవి వాటిని 50 వేలకు పెంచి ఆ తర్వాత 1.16కు గత ప్రభుత్వం పెంచడం జరిగింది. కానీ గతంలో కూడా ఇద్దరు దివ్యాంగులకు పెళ్లి చేసుకుంటే ఇద్దరికీ ఇవ్వాలన్న డిమాండు గతంలో కూడా ఉండేది. కానీ అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు ఇప్పుడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులపైన ఉన్న ప్రేమ అభిమానంతో దివ్యాంగుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి అభ్యుదయం కొరకు ఇప్పుడు ఇద్దరూ దివ్యాంగులై ఉండి పెళ్లి చేసుకుంటే వివాహ ప్రోత్సాహాన్ని ఇద్దరికీ వర్తించే విధంగా జీవో జారీ చేయడం పట్ల వాళ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సంబంధిత శాఖ మంత్రి సీతక్కకు వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మకి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని దృష్టిలో పెట్టుకొని త్వరలో రూ.6 వేల పెన్షన్ వర్తించే విధంగా చూడాలని వాళ్లు ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో వీరితోపాటు తిరుపతయ్య కూడా పాల్గొన్నారు.

# దళితులపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయాలి

**మక్తల్ టౌన్, మే 21 ప్రభాతవార్త:** మక్తల్ పట్టణ కేంద్రంలోని విశ్రాంతి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పృథ్వీరాజ్ మాట్లాడుతూ నిర్మల్ జిల్లా,ముథోల్ మండలం, బోరిగాం గ్రామంలో గల ప్రభుత్వ భూమిలో పెద్దల తీర్మానం ప్రకారమే బుద్ధ పౌర్ణమి సందర్భంగా బుద్ధ విగ్రహ ప్రతిష్టాపన చేసుకుంటున్న దళితులపై అగ్రకుల అహంకారంతో దాదాపు 500 మంది మూకుమ్మడిగా దాడి చేయడాన్ని అంబేద్కర్ యువజన సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కులం పేరుతో దూషిస్తూ మహిళలను, వృద్ధులను సైతం పిడిగుద్దులు గుద్దుతూవీరంగం సృష్టించిన కుల ఉన్మాదులను వెంటనే అరెస్టు చేసి కేసులు నమోదు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం మక్తల్‌గా డిమాండ్ చేస్తున్నాం. ఇప్పటికీ ఘటన జరిగి వారం రోజులు కావస్తున్న మాపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోమని దళితులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నప్పటికీ కేసులు నమోదు చేయకుండా పోలీసులు అధికారులు ప్రభుత్వ యంత్రాంగం దళితుల పట్ల నిర్లక్ష్య వైఖరిని ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్‌యువజన సంఘంఅధ్యక్షులు పృథ్వీరాజ్, ప్రధాన కార్యదర్శి బండారి కృష్ణ, ఉపాధ్యక్షులు బ్యాగరివెంకటేష్, కార్యవర్గసభ్యులు క్రరెమ్‌అంజయ్య, క్రరెన్‌శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు

# ఉపాధ్యాయుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

**- ఉపాధ్యాయుల విద్యా బోధన పటిష్టం చేయటం కోసమే శిక్షణ తరగతులు -నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



శిక్షణ తరగతుల్లో నైపుణ్య విషయాలను తెలియజేస్తున్న కలెక్టర్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 21 ప్రభాతవార్త:** ఈ నెల 13 నుండి జిల్లాలో ప్రారంభమైన వృత్తి నైపుణ్యాల శిక్షణలో భాగంగా బుధవారం పెంట్లవెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సందర్శించారు.ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్యాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెంట్లవెల్లి మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఇస్తున్న శిక్షణా బోధన అంశాలను కలెక్టర్ నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు ఉత్తమ బోధకుడిగా ఎదిగితేనే విద్యార్థులు విజేతలుగా మారగలరని, బోధనా నైపుణ్యాలు మెరుగుపడితే పఠన, లెక్కింపు, విశ్లేషణాత్మక ఆలోచన సామర్థ్యాలు విద్యార్థుల్లో పెరుగుతాయన్నారు. పాఠశాల దశ నుండే విద్యార్థుల్లో లక్ష్య నిర్ధారణ అలవాటు చేయాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన బోధన పద్ధతులను అవలంభించాలన్నారు. ఉపాధ్యాయులు నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులకు ఉత్తమ విద్య అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. విద్యార్థుల్లో చిన్ననాటి నుండే లక్ష్య నిర్ధారణ అలవాటు చేయాల్సిన అవసరం ఉందని, కొత్త బోధన పద్ధతుల్ని అవలంభించి నిరంతరం నూతన విషయాలను నేర్చుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలో అందిస్తున్న శిక్షణలనుఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకొని, విద్యారంగంలో ఉత్తమ ఫలితాల కోసం కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట అకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్, ఎంఈఓ ఇమానియల్ తదితరులు ఉన్నారు.

# ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

**- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి**

**- డీఈఓ రమేష్ కుమార్**



డీఈఓ రమేష్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

**కల్వకుర్తి, మే 21 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు న్యాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాని నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారి ఏ.రమేష్ కుమార్ అన్నారు. బుధవారం కల్వకుర్తి పట్టణంలోని సత్యసాయి సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, కల్వకుర్తి, ఊర్కొండ, వంగూరు, చారకొండ మండలాల ఉపాధ్యాయులకు న్యాయకత్వ లక్షణాలపై నిర్వహించిన 5రోజుల శిక్షణ తరగతుల శిబిరాన్ని వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు రవీందర్‌తో కలిసి డీఈఓ రమేష్ కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు నాయకత్వ పాత్రలను పోషించడం ద్వారా విద్యార్థుల అభ్యాసాన్ని ప్రోత్సహించవచ్చు అని, వారిని ప్రేరేపించి, అభ్యాస ఫలితాలను మరింత మెరుగుపరచవచ్చునన్నారు. ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి దోహదం చేయడానికి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు, న్యాయకత్వ లక్షణాలు చాలాఅవసరమని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని డీఈఓ రమేష్‌కుమార్ ఈ సందర్భంగా సూచించారు. వందేమాతరం వ్యవస్థాపక అధ్యక్షులు రవీందర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ఉపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులు నిత్యవిద్యార్థి కావాలని, ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకోవాలని పేర్కొన్నారు. శిక్షణ తరగతులకు హాజరైన డీఈఓ రమేష్‌కుమార్‌ను ఉపాధ్యాయులు శాలువాలతో సన్మానించారు.ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి బరపటి వెంకటయ్య, ఆయా మండలాల మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ దైవ మార్గాన్ని అనుసరించాలి

**-ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి**





విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

**ఊర్కొండ, మే21 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు దైవ మార్గాన్ని అనుసరించి భక్తి భావంతో మెలుగాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి పేర్కొన్నారు.ఊర్కొండ పేట శ్రీపబ్బతి ఆంజనేయ స్వామి దేవాలయంలో గణపతి, ధ్వజస్తంభ, నవగ్రహ ప్రతిష్ట, గర్భాల యంపై, రాజగోపురంపై కళశ ప్రతిష్ట కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. హంపి పీఠాధిపతులు జగద్గురు శ్రీశంకరాచార్యులు కరకములచే హోమాలు, యంత్ర ప్రతిష్ట కార్యక్రమాలు, రాజుశర్మ, దేవాలయ అర్చకులబృందం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరు యాంత్రీక జీవితానికి అలవాటు పడి దైవ మార్గానికి దూరమవుతున్నారని, ప్రతిఒక్కరు దైవమార్గాన్ని అనుసరిస్తే కుటుంబంలో,సమాజంలో సుఖశాంతులు విరజిల్లుతాయని ఆయన పేర్కొన్నారు. సుఖమయమైన జీవితాన్ని మానవులు అలవర్చుకోవాలని, అలాంటి జీవితం ఒక్క అధ్యాత్మిక శక్తి ద్వారానే లభిస్తోం దన్నారు.అదే విధంగా విగ్రహాల ప్రతిష్ట అనంతరం దేవాలయానికి విచ్చేసిన భక్తులకు దర్శనాన్ని కల్పించారు. అనంతరం భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌సత్యనారాయణరెడ్డి, పాలక మండలి సభ్యులు, ఆలయ ఈఓ సత్య చంద్రారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధ్యాప నిఖిల్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, అబ్దుల్ సమి, శ్రీనివాస్, గజస్థంభ, విగ్రహాల దాతలు,ఎస్సై కృష్ణదేవ, దేవాలయ, పోలీస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యా సామర్థ్యాలు పెంపొందించుకోవాలి



శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు

**మానవపాడు, మే21 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు విద్యా సామర్థ్యాలు పెంపొందించుకోవాలని అలాగే విద్యార్థులకు ఆసక్తికరంగా, బోధనను ఆకర్షణీయంగా, అర్థవంతంగా నిర్వహించేందుకు ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ఐదు రోజుల కార్యక్రమం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని మండల విద్యాధికారి శివప్రసాద్ తెలిపారు. బుధవారం అలంపూర్ చౌరస్తాలోని విశ్వశాంతి జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయులు వృత్తి సామర్థ్యాల పెంపుదలపై శిక్షణ శిబిరాన్ని రెండో రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక భాషా గణిత భావనలను కృత్యాధార పద్ధతిలో పిల్లలకు నేర్పేందుకు నూతన సాంకేతికతను ఉపయోగించి బోధనను మరింత సులువుగా చేసేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలను ఉపయోగించుకోవాలని ఉపాధ్యాయులను మండల విద్యాధికారి శివప్రసాద్ కోరారు. ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో తెలుగు ఆంగ్లం గణితం పరిసరాల విజ్ఞానంతో పాటు ఉపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ కూడా శిక్షణ ఉంటుందని తెలిపారు. వివిధ సామాజిక నేపథ్యమున్న పిల్లలను చేరదీసి వారిలోని సామర్థ్యాలనుగుర్తించి తననుగుణంగా బోధనను ఆసక్తికరంగా మార్చి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉండవల్లి మండల ఎంఈఓ రామకృష్ణ సెంటర్ ఇన్చార్జి జిహెచ్ఎం హేమలత,అనిత బాయి, రిసోర్స్ పర్సన్స్ శాలం విజయభాస్కర్ రెడ్డి ,రాణి, గజరాజు ,సత్యనారాయణమూర్తి మక్బూల్, కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.


# క్రీడలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి



అమరచింత జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల గ్రౌండ్ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్

**అమరచింత మే 21. ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుంద ని మక్తల్ ఎమ్మెల్యే, డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేనారెడ్డి , తెలంగాణ రాష్ట్ర కల్లు విభాగం చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ తో కలిసి అమరచింత మున్సిపల్ కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గ్రౌండ్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ చైర్మన్ శివసేన రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ప్రతి జిల్లాలో కబడ్డీ క్రీడలను ప్రోత్సహించడానికి కబడి మ్యాటను మంజూరు చేస్తున్నామని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి కోరిక మేరకు అమరచింత లో కబడి మ్యాటును మంజూరు చేస్తున్నానని అలాగే అమరచింతలో కోటి నిధులతో ఇండోర్ స్టేడియం నిర్మాణం చేపడుతున్నామని ఆయన తెలిపారు. శిథిల వ్యవస్థలో ఉన్న భవనాలను వెంటనే తొలగించి రెండు రోజులలో నివేదిక అందచేస్తే ఇండోర్ స్టేడియానికి నిధులు మంజూరు చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా కార్యదర్శి, అయూబ్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, కేజీ మహేందర్‌రెడ్డి, మాజీఎంపిటిసి తిరుమలేష్,తౌఫిక్,విష్ణు, హనుమంతు నాయక్, బీసీరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, బాలరాజు, ప్రభుదాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాద నిర్మూలనకు కృషి చేద్దాం




**మక్తల్, మే 21 ప్రభాతవార్త :** ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న ఉగ్రవాద నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా కృషి చేద్దామని సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పిఈటి బి. గోపాలం పిలుపునిచ్చారు. జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మక్తల్ పట్టణంలో క్రీడాకారులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మంది క్రీడాకారులు జాతీయ జెండాను చేతబూని స్థానిక సాయి జ్యోతి ఉన్నత పాఠశాల నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇటీవల పహాల్గాం దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పిఈటిలు రాఘవేందర్, రమేష్ కుమార్, అంజి, క్రీడాకారులు సమత, అంజలి, మీనాక్షి, మల్లీశ్వరి, రాధ, వెంకటేష్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలను వేగవంతం చేయండి

**గద్వాల, మే 21,ప్రభాత వార్త:** తడిచిన ధాన్యమును కొనుగోలు చేలని, గన్ని బ్యాగుల, లారీల కొరత లేకుండా చూడాలని బీజేపి జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధ రెడ్డి జిల్లా కలెక్టర్ ను కోరారు.జోగులాంబ గద్వాల జిల్లాలో ధాన్యం కొనుగోలు మందకొడిగా సాగుతున్నాయని, వేగవంతం చేసి అకాల వర్షాల నుంచి రైతుల నష్టాలను తగ్గించాలని డీకే స్నిగ్ధ రెడ్డి ఫోన్ ద్వారా జిల్లా కలెక్టర్ బీఎం సంతోష్‌ని కోరి నట్లు ఆమె విలేకరులకు తెలిపారు.కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగులు కొరత ఉందని,వెంటనే గన్ని బ్యాగులో తెప్పించాలని కోరారు.లారీల కొరత వలన కాంట అయిన ధాన్యం మిల్లులకు చేరడం లేదని ఆమె కలెక్టర్ కి వివరించడంతో సానుకూలంగా స్పందించి తగు చర్యలుతీసుకుంటామని కలెక్టర్ హామీఇచ్చిట్లు ఆమె తెలిపారు. అకాల వర్షాలు కురుస్తున్నాయని, ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలనిఆమె కోరారు.రైతులు తెలియక జీరో అకౌంట్ ఇస్తున్నారని, దీనివలన డ్రా చేసుకునే సమయంలో ఇబ్బందులు వస్తున్నాయనిఈ సమస్యను పరిష్కరించాలనిడికె.స్నిగ్ధ రెడ్డి కోరారు.దొడ్డుధాన్యంకొనుగోలు చేయడంలేదని,మిల్లర్లు తిరస్కరిస్తున్నట్లు సెంటర్ నిర్వాహకులు చెబుతున్నారని ఈ సమస్యను పరిష్కరించి, దొడ్డు ధాన్యము కొనుగోలు చేయాలని డికె స్నిగ్ధా రెడ్డి కలెక్టర్‌ని కోరారు.రైతులకు ధాన్యం కొనుగోలు విషయంలో ఏవైనా ఇబ్బందులు,సమస్య ఏర్పడితే భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు.

## విద్యార్థుల స్థాయికి తగ్గ బోధన చేపట్టాలి

**అలంపూర్ మే 21 ప్రభాతవార్త:** ఉపాధ్యాయులు విద్యార్థులకు తగ్గ విద్య బోధన చేయాలనీ అలంపూర్ మండల విద్యాధికారి అశోక్ కుమార్ తెలిపారు. మౌలిక భాష, గణిత సామర్థ్యల సాధన (సిఎల్ఎన్ ) అయిదు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు బుధవారంమంటెస్సోరి హై స్కూల్లో ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఎమ్ ఈ ఓ, మాట్లాడుతూ ,ఉపాధ్యాయులు సబ్జెక్టు వారీగా తగు నైపుణ్యాలు పెంపొందించుకుని పాఠశాలలో విద్యార్థుల స్థాయికి తగ్గ బోధన చేయాలన్నారు.పాఠశాలలో విద్యార్థుల నమోదును,ప్రగతిని పెంచలన్నారు. ఉదయం సేస్సన్ (1)తెలుగు సబ్జెక్టు శిక్షణ మరియు గణిత బోధన శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు. గణితంలో ప్రైమరి తరగతులలో విద్యార్థులు ఎదురుకుంటున్న సమస్యల గురుంచి ఎలా అదిగమించాలి, నూతన బోధన పద్ధతులు పాఠంశ శిక్షణనిర్మాణం గురించి ఆర్‌ఎస్‌పి. వీరేశప్ప, బి. నాగరాజు ఉపాధ్యాయులకు చక్కగావివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ పి. లు, పద్మనాభశాస్రి, శ్రీనివాసులు, రాజ కుమార్,శ్యాంసన్,బి.పెద్దయ్యనాయుడు, ఎల్లకృష్ణ పాల్గొన్నారు.

## పభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పించాలి

**ఆత్మకూర్, మే 21, ప్రభాతవార్త:** రాష్ట్రవ్యాప్తంగా మరో 20 రోజుల్లో ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో కనీసవస్తులు కల్పించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని అఖిల భారత యువజన సమాఖ్య అనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి కుతూబ్ డిమాండ్ చేశారు. బుధవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటుగా మండలంలోని పలు గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో పరిశీలించి ఆయన విలేకరులతో మాట్లాడారు ఈ సందర్భంగా కుతూ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే చర్యలు చేపట్టాలని విద్యాశాఖను తన వద్దకు ఉన్నప్పటికీవిద్యార్థులకు కనీస మౌలిక వసతులు కల్పించక పోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు భక్త నియోజకవర్గం లోని పలు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినులకు కనీసం టాయిలెట్లు కూడా లేకపోవడం చేత తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారని ఆయనఆవేదన వ్యక్తం చేశారు విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు పుస్తకాలను సరఫరా చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు చరణ్ ఇమ్రాన్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు పాల్గొన్నారు....

## ఉచిత కంటి పరీక్షా శిబిరం

**అయిజ, మే 21, ప్రభతవార్త:** మండలపరదిలోని ఉత్తనూరు గ్రామంలో బుధవారం శంకర కంటి ఆసుపత్రి, భవిష్య భారత్ మరియు ఎస్బిఐ ఫౌండేషన్ సహకారంతో, గ్రామంలో ఒక ప్రత్యేక కంటి పరీక్షా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు ఇందులోభాగంగా మొత్తం 78 మంది వ్యక్తులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. 13 మంది కంటిశుక్లం శస్త్రచికిత్సల కోసం గుర్తించబడ్డారు. అదనంగా,22 మంది రోగులుఉచిత రోగ లక్షణ పరీక్షలు చేయించుకున్నట్లువరుతెలిపారు శస్త్రచికిత్సల కోసం సూచించబడిన రోగులందరినీఉచిత శస్త్రచికిత్సలకోసం హైదరాబాద్‌లోని శంకర కంటి ఆసుపత్రికి తరలించారు, పికప్ మరియు డ్రాప్ కోసం ఉచిత రవాణా సౌకర్యం ఉంటుందని ఈ చొరవ గ్రామీణవర్గాలకు నాణ్యమైనకంటి సంరక్షణ సేవలను అందించడంలో నిబద్ధతను హైలైట్ చేస్తుందని వారు అన్నారు. కార్యక్రమంలో కంటివైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన బిజెపి కొండ ప్రశాంత్‌రెడ్డి

**దేవరకద్ర మే 21 ప్రభాతవార్త:** దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల మండలం రాజోలి గ్రామానికి చెందిన బిజెపి కార్యకర్త రవికుమార్ బుధవారం వివాహనికి ముఖ్య అతిథిగా హాజరై వధూవరులకు నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల అధ్యక్షుడు బడుగుల రాజేశ్వర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు రవీందర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ వడ్ల శివచారీ,రాజోలి గ్రామ నాయకులు శ్రీను, నరేష్ ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**నారాయణపేట, మే21 ప్రభాతవార్త :** నారాయణపేట కేంద్రంలో తిప్రాస్‌పల్లి రాము అనారోగ్యానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.18 వేల చెక్కును వారి కుమారుడు తరుణ్‌కు అందజేసి సహకరించిన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఇటు చెక్కును అందజేసిన వారు బీజేపీ జిల్లా అధ్యక్షులు కె. సత్యయాదవ్ లీగల్ సెల్ కన్వీనర్ నందు నామాజీ, పట్టణ అధ్యక్షుడు పోషల్ వినోద్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు కృష్ణ, కమలాపూర్ శ్రీనివాస్, సూర్యకాంత్ నామాజీలు పాల్గొనడం జరిగింది.

## బాల్య వివాహాలు, సైబర్ నేరాలపైన అవగాహన

**శ్రీరంగాపూర్, మే 21 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలం నాగసానిపల్లి గ్రామంలో గ్రామ ప్రజలకు సైబర్ నేరాల పైన, అదేవిధంగా భాల్యవివాహాలపైన అవగాహన కల్పించడం జరిగింది. అమ్మాయికి 18సంవత్సరాలు వచ్చేవరకువివాహం చేయరాదని, అపరిచిత వ్యక్తులు ఎవరన్నా కనిపించిన 100 నెంబర్‌కు డయల్ చేయాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని శ్రీరంగాపూర్ ఎస్సై రామకృష్ణ వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ ఎస్సై రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులలో అనంతమైన శక్తి దాగి ఉంది

- విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే
- చెడుగా ప్రవర్తించే వారిపై నిఘా విభాగం దృష్టి సారిస్తుంది
- పిల్లలకు చిన్నప్పటి నుంచే సంస్కారం నేర్పించాలి
- వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

**వనపర్తి క్రైమ్, మే21 ప్రభాతవార్త:** భావి సమాజ నిర్మాతలు నేటి ఉపాధ్యాయులని ఉపాధ్యాయులలో అనంతమైన శక్తి దాగి ఉంది విద్యార్థులకు బోధించి శక్తివంతులుగా తీర్చిదిద్దాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ఉర్దూ బాలుర,బాలికల ఉన్నత పాఠశాలలో జరుగు


బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఎస్పీ


అవగాహన కల్పిస్తున్న ఎస్పి రావుల గిరిధర్

తున్న ఐదు రోజుల వృత్యంతర శిక్షణలో భాగంగా రెండవ రోజు బుధవారం ఏహెచ్‌టియు, సఖి, భరోస వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులకు డ్రగ్స్, బాల్యవివాహాలు, సైబర్ నేరాలు, గురించి అవగాహన కల్పించి విద్యార్థులకు బోధించి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించే విధంగా ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ తరగతి గదిలో దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే పౌరులను తయారు చేసే నిర్మాతలు గురువులని పేర్కొన్నారు. సమాజంలో విద్యార్థులను ఉన్నత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని,వారికి స్పష్టమైన దిశ, దశను నిర్దేశించి వారిని ఉన్నత లక్ష్యాల వైపు తీసుకెళ్లాల్సిన గురుతర బాధ్యత నేటి ఉపాధ్యాయులపై ఉందని తెలియజేశారు. ఒకనాటి పిల్లల బాల్యం నేటి పిల్లల బాల్యంలో చాలా వ్యత్యాసం ఉందని ఆయన చెప్పారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రధానంగా క్రమశిక్షణతో పాటు సంస్కారాన్ని నేర్పాలని కోరారు. తల్లిదండ్రులు గురువులు తోటి సమాజాన్ని గౌరవించే విధానం చిన్నప్పటి నుంచే పిల్లల్లో అలవడాలని అన్నారు. అంతేకాక బాల్య వివాహాలు, నిరక్షరాస్యత డ్రగ్స్ , సైబర్ నేరాలు, చెడువ్యసనాలపై తల్లిదండ్రుల సమావేశం రోజున పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని అన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలతో అసభ్యంగా ప్రవర్తిస్తే షిటీం నిఘా వ్యవస్థ ఎప్పుడూ గమనిస్తూ ఉంటుందని, ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసే విషయాలను తెలియజెప్పాలని ఎస్పీ వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయులు విద్యార్థుల గుండెల్లో ఎప్పటికీ గుర్తుంచుకుంటారని అందుకు ప్రతి ఉపాధ్యాయుడు తనవంతు కృషి చేయాలని ఆయన తెలిపారు. వనపర్తి జిల్లాలో విద్యని బలోపేతం చేసి పాఠశాలలలో విద్యార్థుల సంఖ్యని పెంచి నాణ్యమైన విద్యను అందించి రాష్ట్ర స్థాయి ఫలితాలలో ఉత్తమ స్థానాన్ని సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్స్ శ్రీనివాసులు, ఐ.సుదర్శన్ రావు, మల్లేశ్, సెంటర్ ఇంచార్జి జ్యోతి, శిక్షణ కోర్స్ డైరెక్టర్‌లు జ్యోతి, ఆనంద్, ఉమాదేవి, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు, చెన్నమ్మ తామస్, సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ కవిత, సెక్టోరియల్ అధికారులు, యుగంధర్, శేఖర్, డిఎస్ఒ శ్రీనివాసులు, ఏహెచ్‌టియు ఎస్సై,అంజద్, భరోస సెంటర్ సిబ్బంది తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూ భారతి భూ సర్వేకు అందరు సహకరించాలి

■ అదనపు కలెక్టర్ మోహన్ రావు

**గండీడ్, మే 21 ప్రభాతవార్త;** భూ భారతి భూ సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు అన్నారు. బుధవారం గండీడు మండలలో భూ భారతి భూ సర్వేపై పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయబడ్డ సాలానగర్ గ్రామంలో అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరతయారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ సర్వేలోరైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీగా నిర్వహించే ఈ సర్వేకు రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గండీడు ఇన్చార్జి తహసిల్దార్ మాధవి, ఎంపీడీవో దేవన్న, ఏడి సర్వే కిషన్ రావు, ఏవో రాంపాల్, ఏటీఎం బాలకృష్ణ, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితునికి సెల్ ఫోన్ అప్పగించిన సీఐ

**వెల్దండ, మే 21 ప్రభాతవార్త:** వెల్దండ మండలంలోని శంకర్‌కొండ తండాకు చెందిన ఇస్లావత్ రూప్‌సింగ్ ఈ మధ్యకాలంలో వెల్దండ నుండి తన స్వగ్రామానికి వెళుతుంటే మార్గమధ్యలో సెల్ ఫోను పోగొట్టుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు పోగొటుకున్న సెల్‌ఫోన్‌ను బుధవారం సీఐ కార్యాలయంలో సీఐ విష్ణువర్ధన్ రెడ్డి, ఎస్ఐ కురుమూర్తి బాధితునికి సెల్‌ఫోనును అందజేశారు. సీఐ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ సెల్‌ఫోను పోగొట్టుకున్న వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, సిఐఇఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ అవుట్ చేసి గుర్తించి బాధితులకు అందిస్తామన్నారు. క్రైమ్ పోలీస్ ఆంజనేయులు, శ్రీనివాస్ రెడ్డిలు ఉన్నారు.

## ఘనంగా రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలిశ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలు

**వెల్దండ, మే 21 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాసరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి పేరు మీద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకు తయారు చేయించి కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పుట్ట రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఐజాక్, మాజీ సర్పంచ్‌లు వెంకటేశ్వరరావు, ప్రభాకర్, మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, నరసింహ, సింగిల్ విండో డైరెక్టర్ మొక్తాల శేఖర్, నాయకులు జంగిలి ఆనంద్, జోగయ్య, మధుసూదన్ రెడ్డి, కొండల్ యాదవ్, రవికుమార్, తదితరులు ఉన్నారు.

## వాల్మీకి మహర్షి విగ్రహ ప్రతిష్ట ఏర్పాట్ల పరిశీలన

**మానవపాడు, మే 21 ప్రభాతవార్త:** రాజోలి మండలం పెద్ద తాండ్రపాడులో ఈనెల 23 శుక్రవారం నాడు వాల్మీకి విగ్రహ ప్రతిష్ట దేవాలయ మహోత్సవ కార్యక్రమం ఉంటుందని గ్రామ వాల్మీకి కుల బాంధవులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామాన్ని రాష్ట్ర వాల్మీకి సంఘం నాయకులు అడ్వకేట్ మండ్ల మధుసూదన్ బాబు, జిల్లా నాయకులు పచ్చర్ల శ్రీనివాసులు సందర్శించారు. వాల్మీకి విగ్రహ ప్రతిష్ట, దేవాలయ ప్రాంగణాన్ని వారు పరిశీలించారు. అనంతరం వాల్మీకి సోదరులకు ఏర్పాట్ల గురించి తగుసూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు వాల్మీకి కుల బాంధవులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. గ్రామ వాల్మీకి సంఘం నాయకులు, వాల్మీకి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి : సిపిఐ

**వనపర్తి రూరల్, మే 21 ప్రభాతవార్త:** తాలు,తరుగు పేరుతో ప్రతి క్వింటాలుకు మూడు నుంచి ఐదు కిలోలు దోచుకుంటున్న మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. వర్షాలు పడిన నేపథ్యంలో వనపర్తి మార్కెట్ యార్డును సిపిఐ నేతలు, చిట్యాలకు చెందిన రాము మరికొందరు రైతులతో సందర్శించినట్లు పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో ప్రతి బస్తాకు 40 కిలోలు తూకం వేయాల్సి ఉండగా 41 కిలోలు తూకం వేసి రైతులకు నష్టం చేస్తున్నారన్నారు. వీటిని లారీలలో మిల్లులకు పంపితే అక్కడ ప్రతి క్వింటాలుకు మూడు నుంచి ఐదు కిలోలు షార్టేజ్ పేరుతో మిల్లర్లు దోచుకుంటున్నారన్నారు. శ్రీరంగాపురానికి చెందిన కొందరు మిల్లర్లు బరితెగించి ఐదు కిలోల తరుగుకు ఒప్పుకుంటేనే లారీల నుంచి ధాన్యం దించుకుంటామని, లేదంటే తీసుకెళ్లి పొమ్మనిచెప్పేస్తున్నారన్నారు. చిట్యాలకు చెందిన కొందరు రైతులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోలేదని తెలిపారు. దోచుకుంటున్న మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. ధాన్యం నిల్వ చేసేందుకు మిల్లర్లపై ఆధారపడకుండా ప్రత్యేక గోదాముల వసతిని అధికారులు కల్పించాలన్నారు.

## పంటల మార్పిడితో అధిక దిగుబడులు

**తెల్కపల్లి, మే21 ప్రభాతవార్త:** పంటల మార్పిడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని ప్రొ॥ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సేద్య విభాగపు వ్యవసాయ అధికారి డా. ఎంఎం కాడ సిద్ధప్ప అన్నారు. బుధవారం మండల పరిధిలోని గౌరారం గ్రామంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా వారు పాల్గొని మాట్లాడుతూ తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించే పద్ధతులను వివరించారు. మైక్రో ఇరిగేషన్ డ్రిప్ సిస్టం స్ప్రింక్లర్ల పద్ధతులు పాటించడం ద్వారా మొక్కలకు నేరుగా నీరు అంది వేర్లు ఎరుగుదల అధిక ఉత్పత్తులు సాధించవచ్చునని సూచించారు. రబీ కాలంలో తక్కువ నీటిని ఎంచుకునే పంటలను వేసుకోవాలని సూచించారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా పచ్చి రొట్టె లాంటి పద్ధతులను పాటించాలని సూచించారు. అనంతరం రైతులకు విత్తన శుద్ధి మట్టిని ఏవిధంగా శుద్ధి చేసుకోవాలో చూపించారు. ఒకసారి వేసిన విత్తనాలుమరోసారి నాటుకుంటే పంట పండదని మంచి స్పష్టమైన మొక్కలచే వచ్చిన విత్తనాలను మనమైనా విత్తన శుద్ధి చేసుకుని విత్తనాలు వేసుకుంటే సరైనటువంటి పంట పండే అవకాశం ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో సేద్యం విభాగపు వ్యవసాయ అధికారులు డాక్టర్ వినూత, తెగులు నివారణ అధికారి డా. దివ్య, రాకేష్ శోభారాణి రాగేష్, వ్యవసాయ విశ్వనాధికారి సంతోష్ పుష్పాలన నాయకులు వెంకటేష్, మాజీ సర్పంచ్ చిన్న జంబులు పలువురు రైతులు పాల్గొన్నారు.

## డాక్టర్ రాంబాబు అంతిమ యాత్ర

**నారాయణపేట టౌన్, మే 21 ప్రభాతవార్త:** విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు డా. రాంబాబు అంతిమ యాత్ర బుధవారం టీచర్స్ కాలనీ నుండి ఆర్డిఓ ఆఫీస్, రవితేజ స్కూల్, మూల హనుమాన్ దేవాలయము, సెంటర్ చౌక్, సావర్కర్ చౌక్, సత్యనారాయణ చౌక్, యాదగిరి రోడ్డు ద్వారా కేవీర్ గార్డెన్, భైరంకొండ ఫామ్ ల్యాండ్‌లో అంత్యక్రియలు జరిగాయి. అంతకు ముందు విషయాన్ని తెలుసుకున్న భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజకుమార్‌రెడ్డితో పాటు ఆయా పార్టీల పార్థివ దేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అంత్యక్రియలలో ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## రైతు గుర్తింపు కార్డు కోసం దరఖాస్తు చేసుకోండి

**నారాయణపేట టౌన్, మే 21 ప్రభాతవార్త:** రైతు గుర్తింపు కార్డుల కోసం దామరగిద్ద క్లస్టర్ పరిధిలోని రైతులు నేడు దామరగిద్ద మండల కేంద్రంలోని రైతు వేదికలో గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని దామరగిద్ద క్లస్టర్ ఏఈఓ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ రైతు విశిష్ట సంఖ్యను ఫార్మర్ ఐడి పొందుటకు మీ ఆధార్, భూ యాజమాన్య పాస్ పుస్తకము ఆధార్‌కు లింక్ చేయబడిన మొబైల్ నెంబరు తీసుకొని రావాలన్నారు. క్లస్టర్ పరిధిలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కేసీఆర్‌కి నోటీసులు కక్ష్య పూరిత చర్య

**బిజినేపల్లి, మే21 ప్రభాతవార్త:** కాళేశ్వరం ప్రాజెక్టుతో తెలంగాణను సస్యశ్యామలం చేసిన కేసీఆర్‌కి నోటీసులు పండడం పూర్తిగా రాజకీయ కక్ష్య పూరిత చర్య అని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంగానమోని కిరణ్ తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి కెసిఆర్‌కు నోటీసులు పంపడంపై బుధవారం ఓ ప్రకటనలో ఖండించారు. చావునోట్లో తలపెట్టి రాష్ట్రాన్ని సాధించి, రాష్ట్రాన్ని దేశంలో అగ్రభాగాన నిలిపిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కి కాళేశ్వరం కమిషన్ నోటీసులను కాంగ్రెస్ రాజకీయ కమిషన్ నోటీసులుగానే పరిగణిస్తున్నామని అని విమర్శించారు. నిద్రాహారాలు లెక్క చేయకుండా తెలంగాణ ప్రజల సాగునీటి గోస తీర్చేందుకు కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేశారని, దీంతో తెలంగాణ కోటి ఎకరాల మాగాణిగా మారిందని పచ్చని పంటలతో విరాజిల్లిందని తెలిపారు. పాలన చేతకాని రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజల దృష్టి మరల్చేందుకు అవసరమున్నప్పుడల్లా ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని వివరించారు. తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకు తెలంగాణ శ్రేయస్సు కోసమే పనిచేసే కేసీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కుట్రలు చేయడం తెలంగాణ సమాజం సహించదని పేర్కొన్నారు. కేసీఆర్ కి నోటీసులు పండడం పూర్తిగా రాజకీయ కక్ష్య పూరిత చర్యనే అని దూషించారు.

## మక్తల్ నియోజకవర్గంలో క్రీడామైదానాలు అభివృద్ధి పరుస్తాం

- స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి


క్రీడాకారులతో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**మక్తల్ టౌన్, మే 21 ప్రభాతవార్త:** మక్తల్ మిని స్టేడియంలో క్రీడాకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో నేడు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, నియోజకవర్గ శాసనసభ్యులు డా. వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాలకు దాదాపుగా రూ. 5 కోట్ల 30 లక్షలతో క్రీడా మైదానాలను తీర్చిదిద్దడానికి ఏర్పాట్లు చేస్తున్నందుకు శివసేనరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం శివసేన రెడ్డి మాట్లాడుతూస్థానిక శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి అడిగినట్లు స్టేడియంలో దాదాపుగా అన్నింటికీ అనుమతులు ఇస్తున్నానని తెలియజేశారు. ఈ సందర్భంగా పిఇటిలు, క్రీడాకారులు స్థానిక శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డిలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, కార్యకర్తలు క్రీడా అభిమానులు పాల్గొన్నారు.

## బాల్యం నుండే చేతి రాతను పెంపొందించుకోవాలి

- సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్



పలుస శంకర్ గౌడ్‌ను సన్మానిస్తున్న స్కూల్ యజమాన్యం


**వనపర్తి క్రైమ్, మే 21 ప్రభాతవార్త :** పిల్లలు బాల్యం నుండే చేతి రాతను పెంపొందించుకోవాలని సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ అన్నారు. బుధవారం స్థానిక రేడియంట్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన అందమైన చేతి రాతపై శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శంకర్‌గౌడ్ మాట్లాడుతూ న్యూ స్కిల్ అకాడమీ పక్షాన డైరెక్టర్ తరుణ్ కుమార్ వనపర్తిలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల భావి జీవితం చదువుతో పాటు అందమైన చేతి రాతపై కూడా ఆధారపడి ఉంటుందని,తప్పులు లేకుండా అందమైన చేతి రాత గల విద్యార్థులు చక్కటి మార్కులను సాధించే అవకాశం ఉందని శంకర్ గౌడ్ పేర్కొన్నారు. కళాత్మకమైన చేతిరాతవల్ల భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఆయన సూచించారు. ఈనాటి కార్యక్రమంలో కవి జనజ్వాల,డి.రాములు, వాఖ్యాత బైరోజు చంద్రశేఖర్, ఎస్సీ, ఎస్టీ, మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగరాజు, దర్శకుడు తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

**బిజినేపల్లి, మే 21 ప్రభాతవార్త:** నంది వడ్డెమాన్ గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన బాధిత కుటుంబాలకు బుధవారం ఆర్థిక సహాయం అందించారు. చింతి గారి ఉషమ్మ, నక్క బాలస్వామి కుటుంబాలను పరామర్శించి బాధిత కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయాన్ని గ్రామ యువకులు శెట్టి రాజేష్ కుమార్, విష్ణువర్ధన్ రెడ్డిలు అందించి గుండె ధైర్యం చెప్పారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు భవిష్యత్తులో సైతం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా కల్పించారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించిన యువకులను మాజీ ఎంపిటిసి ఉషన్న, జనిగే చిన్నయ్య, కారుకొండ వెంకటేష్ ,జక్కి ,వీరస్వామిలు పేదవారికి అండగా ఉంటూ ఆర్థిక భరోసా కల్పించడం అభినందనీయమని గ్రామస్తులు తోటి మిత్రులు, అభినందించారు.

## ఎల్‌ఎల్‌బి ఫలితాలు విడుదల

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్, మే 21 ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయ పరిధిలోని వనపర్తి లా కళాశాలకు సంబంధించిన ఎల్‌ఎల్‌బి ఫలితాలు విడుదలయ్యాయి. ఆచార్య జిఎన్.శ్రీనివాస్ బుధవారం పరిపాలన భవనంలో ఉపకులపతి ఆచార్య జిఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొ॥ రమేష్ బాబు, పరీక్షల నియంత్రణ అధికారి డా. ప్రవీణతో


ఫలితాలను విడుదల చేస్తున్న విసి శ్రీనివాస్

కలిసి ఎల్‌ఎల్‌బి ఫలితాలను విడుదల చేశారు. పాలమూరు యూనివర్సిటీ మార్చ్ 2025 లో నిర్వహించిన ఎల్‌ఎల్‌బి (3) మొదటి (I) మూడవ (III) సెమిస్టర్ రెగ్యులర్ / బ్యాక్ లాగ్ పరీక్షల ఫలితాలను ఉపకులపతి విడుదల చేశారు. మొదటి సెమిస్టర్‌లో 74, మూడవ సెమిస్టర్‌లో 85 ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను తెలుసుకోవడానికి అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని పరీక్షల నియంత్రణ అధికారి డా. ప్రవీణ అన్నారు. కార్యక్రమంలో అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డా. శాంతి ప్రియ, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్ డా. బి. సురేష్ పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు ప్రశంస పత్రాలు

- వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచినందుకు అవార్డులు అందజేసిన డిజిపి జితేందర్
- అభినందించిన ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే21, ప్రభాతవార్త:** పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి సేవలు అందించినందుకు గాను నలుగురు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు అధికారులు డిజిపి నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల వివిధ రకాల పనితీరును పరిశీలించిన మీదట రాష్ట్ర డిజిపీ జితేందర్ గురువారం హైదరాబాదులోని డీజీపీ కార్యాలయంలో ఉత్తమ ప్రతిభ కలిగిన పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలను అందజేసారు. ఇందులో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన నలుగురు పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలు అందుకున్నారు. 60 రోజులలో ఫోక్సో కేసులలో ఎక్కువ ఛార్జ్ షీట్లు ఫైల్ చేసినందుకుగాను మహబూబ్‌నగర్ రూరల్ సీఐ బానోతు గాంధీ నాయక్‌కు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం సంపాదించారు. జిల్లా అధికారి ఉత్తర్వుల మేరకు ఔట్ స్టాండింగ్ కేసుల డిటెక్షన్ చేసిన విషయంలో జడ్చర్ల రూరల్ సీఐ టి.నాగార్జునగౌడ్ రాష్ట్ర స్థాయిలో మూడవ స్థానంలో నిలిచారు. యూఐ కేసుల పరిష్కారంలో ఎక్కువ మొత్తంలో పరిష్కరించినందుకుగాను మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై విజయ్ కుమార్ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారు. సిఈ.ఐఆర్ క్యూ ఆర్ కోడ్ వినియోగంలో రాష్ట్ర స్థాయిలో మంచి ప్రతిభ కనబరిచిన నవాబ్ పేట ఎస్సై విక్రమ్‌కి రాష్ట్ర స్థాయిలో ఐదవ స్థానం వచ్చినది. ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను వివిధ విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను డిజిపి నుంచి ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖకు ఇది గర్వకారణమైన ఘట్టం. జిల్లాకు చెందిన నలుగురు పోలీసు అధికారులు తమ కృషి, నిష్ట, సమర్థతతో రాష్ట్రస్థాయిలో గుర్తింపు


డిజిపి నుంచి ప్రశంసా పత్రాలు అందుకుంటున్న సిఐలు గాంధీ నాయక్ , నాగార్జున గౌడ్, ఎస్సైలు విజయ్ కుమార్,విక్రమ్

పొందినందుకు ఎంతో ఆనందంగా ఉంది. వారు ప్రతి కేసును సమగ్రంగా పరిశీలిస్తూ, బాధితులకు న్యాయం అందించడంలో ముందుండి పని చేయడం వల్లే ఈ గౌరవం లభించిందన్నారు. పోలీసింగ్ అంటే కేవలం చట్టాన్ని అమలు చేయడం మాత్రమే కాదు,ప్రతి పౌరుని నమ్మకాన్ని సంపాదించడంకూడా. ఇది కేవలం అధికారుల వ్యక్తిగత విజయంగా కాకుండా, మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకానికి దృఢతను చేకూర్చే ఘట్టంగా చూస్తున్నాం. ఇది జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ఒక ఉత్తేజకర ఉదాహరణ. ప్రతి పోలీసు అధికారి ఈ విజయం నుండి ప్రేరణ పొందాలనీ తమ విధులను మరింత క్రమశిక్షణతో, సమర్థవంతంగా నిర్వహించాలనీ పిలుపునిచ్చారు. మనం అందరం కలసి పనిచేస్తే, జిల్లా పోలీసుల పట్ల ప్రజలకు ఉన్ననమ్మకాన్ని మరింత బలపరిచే స్థితికి చేరుకోవచ్చని సూచించారు. ఈ సందర్భంగా ప్రశంసా పత్రాలు అందుకున్న అధికారులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోమరిన్ని విజయాలుసాధించాలని ఆకాంక్షిస్తున్నాను అన్నారు.

## ముందస్తు చర్యలు తీసుకోవాలి

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- లోతట్టు ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలి
- శాసాబ్ గుట్టలో కాల్వలను పరిశీలించిన కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, మే 21 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలో వర్షాల వలన వర్షపు నీరు నిలిచి లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. బుధవారం మహబూబ్‌నగర్‌లో షాషాబ్ గుట్టలో వర్షపు నీటి కాల్వను నగర పాలక సంస్థ, పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి పరిశీలించారు. రాబోవు వర్షాకాలంలో వర్షాల వలన ముంపు ప్రాంతాలు జలమయం కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షపు నీటి కాల్వ మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షాల వలన ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట


కాల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, నగర పాలక సంస్థకమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయ్ భాస్కర్‌రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ మనోహర్, ఏఈ వైష్ణవి తదితరులు ఉన్నారు.

## సేవకు దానధర్మాలకు మారుపేరు రాణి అహల్యా బాయి హోల్కర్

బిజెపి రాష్ట్ర నాయకురాలు నాగ పరిమళ

**వనపర్తి రూరల్, మే 21 ప్రభాతవార్త:** సేవకు దానధర్మాలకు మారుపేరు మరాఠా యోధురాలు రాణి అహల్యాబాయి హోల్కర్ అని బిజెపి రాష్ట్ర నాయకురాలు నాగపరిమళ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం లక్ష్మి కృష్ణ గార్డెన్స్‌లో జిల్లా అధ్యక్షులు డి.నారాయణ ఆధ్వర్యంలో మరాఠా యోధురాలు అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర నాయకురాలు నాగ పరిమళ మాట్లాడుతూ మరాఠా రాజవంశానికి చెందిన రాణిఅహల్యాబాయి తన పదవయేట మరాఠా సర్దార్లలో ప్రముఖుడైన మల్హర్ రావు హోల్కర్ కుమారుడు ఖండే రావు హోల్కర్‌తో వివాహం జరిగింది. వివాహం జరిగిన కొంత కాలానికే భర్త యుద్ధంలో మృతి చెందడంతో సతీసహ గమనానికి సిద్ధమైన అహల్యాబాయిని మామ మల్హర్ రావ్ అడ్డుకొని యుద్ధ విద్య, రాజనీతి పరిపాలనలో శిక్షణను ఇచ్చాడని, తదనంతరం కొంతకాలానికి మామ మల్హర్ రావు, కుమారుడు మాలేరావు మృతి చెందడంతో ఇండోర్ రాజ్యపాలనా బాధ్యతలను అహల్యా బాయి చేపట్టారని వివరించారు. అహల్యా బాయి ఇండోర్ రాజ్యపాలన చేపట్టడం పట్ల మరాఠాసర్దార్లు అభ్యర్థన చెప్పినప్పటికి నాటి పిష్యా మాధవరావు అండతో 1767 నుంచి 1795 వరకు పాలించారని, ఆ సమయంలో దేశంలో ముస్లిం రాజుల ఆగడాలకు బెంబేలెత్తిన ప్రజలు మరణించడం లేదామ తాన్ని మార్చుకోవడం జరిగిందని పేర్కొన్నారు. దేవాలయాలను మసీదులుగా మారుస్తున్న కాలంలో రాణి అహల్యాబాయి తన సంస్థానం నుండి వచ్చిన ఆదాయంతో దేశంలో అనేక సంస్థానాలలో హిందూ దేవాలయాలను నిర్మించారని, స్వతహాగా శివుని భక్తురాలైన ఆమె సేవకు,దానధర్మాలకు మారుపేరుగా నిలిచారన్నారు. ముస్లింరాజుల దాడులతో శిథిలమైన కాశీ,ద్వారక, మధుర, ఉజ్జయిని,రామేశ్వరం,అయోధ్య,హరిద్వార్, పుణ్యక్షేత్రాలను పునరుద్ధరించారని ఆమె చేసిన సేవలకు భారత ప్రభుత్వం రాణి అహల్యాబాయివోల్కర్ పేరిట స్త్రీశక్తి పురస్కా రాన్ని మొదలు పెట్టారని ఇండోర్ విమానాశ్రయానికి రాణి అహల్యాబాయి హోల్కర్ అంతర్జాతీయ విమానాశ్రయంగా నామ కరణం చేశారని వారు చేసిన సేవలు భవిష్యత్‌తరాలు కూడా గుర్తించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కొనియా డారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లాఅధ్యక్షులు డి.నారాయణ, సబి రెడ్డి వెంకట్‌రెడ్డి, అయ్యగారి ప్రభాకర్‌రెడ్డి ,ఆర్.లోకనాథ్ రెడ్డి, విజయలక్ష్మి, బి.శ్రీశైలం, అక్కల రామన్‌గౌడ్, జ్యోతి రమణ, సుమిత్రమ్మ,బండారు కుమారస్వామి, ఏ.సీతారాములు, పెద్దిరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకురాలు నాగపరిమళ

## క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

**బిజినేపల్లి, మే 21 ప్రభాతవార్త:** ఆరోగ్యశాఖ ఆదేశానుసారం నాట్కో ఫార్మా కంపెనీ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు బలవర్ధకమైన న్యూట్రిషన్ కిట్ల పంపిణీ బుధవారం వైద్యాధికారి డా. ఎం.శివకుమార్ చేశారు. బిజినపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ వ్యాధి తగ్గడానికి ప్రభుత్వం ఉచితంగా అందజేసిన మందులతో పాటు బలవర్ధకమైన పౌష్టిక, సమతుల్య ఆహారం అధిక మొత్తంలో తీసుకోవాలని పోషక విలువలు బలవర్ధకమైన ఆహారం రోగులకు అందించారు. ఒకవైపు మందులు, ఒకవైపు ఆహారం తీసుకున్నప్పుడే వ్యాధి తీవ్రత తగ్గి సమర్థవంతంగా ఆరోగ్యంగా ఉండుటకు శరీరం సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాట్కో ఫార్మా కంపెనీ డిప్యూటీ మేనేజర్ సూర్యనారాయణ డా. మదన్ కుమార్, రమణారెడ్డి, టిబి సూపర్‌వైజర్ శ్రీనివాసులు, వైద్య ఆరోగ్య సిబ్బంది రమేష్ కుమార్, గంగ, మంగ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


రోగులకు కిట్లను అందజేస్తున్న వైద్యాధికారి

